తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

శుక్రవారం /02.02.2024

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

నాగోబా ఆలయంలో రేవంత్ ప్రత్యేక పూజలు

తెలంగాణ వీణ , ఆదిలాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లిలో బహిరంగ సభలో పాల్గొననున్నారు. దాదాపు లక్ష మంది వరకు ఈ సభకు హాజరవుతారని అంచనా.

రాజకీయ పార్టీని స్థాపించిన హీరో విజయ్

తెలంగాణ వీణ , సినిమా : తమిళ గడ్డపై మరో రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. ప్రముఖ సినీ హీరో విజయ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... ఈ ఏడాది జరిగే లోక్ సభ ఎన్నికల్లో టీవీకే పార్టీ పోటీ చేయదని... అలాగే ఏ పార్టీకి మద్దతు ప్రకటించదని చెప్పారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని తెలిపారు. తమిళనాడులో అవినీతి పాలన సాగుతోందని... అవినీతిని అంతం చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. త్వరలోనే పార్టీ జెండా, అజెండా ప్రకటిస్తామని అన్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాని పూర్తి చేసి, ఇక పూర్తి సమయాన్ని రాజకీయ సేవకు వినియోగిస్తానని విజయ్ చెప్పారు. ప్రజాసేవకు రావడాన్ని తనను ఇంతటి వాడిని చేసిన తమిళ ప్రజలకు కృతజ్ఞత తెలుపుకోవడంగా పరిగణిస్తున్నానని అన్నారు. తమిళ సినీ రంగంలో రజనీకాంత్ తర్వాత అంతటి ఇమేజ్ ఉన్న నటుడు విజయ్. ఇప్పటి వరకు 68 సినిమాల్లో నటించారు. విజయ్ రాజకీయ పార్టీని పెడతాడనే చర్చ గత దశాబ్ద కాలంగా జరుగుతోంది. పలు సామాజిక సేవా కార్యక్రమాలను విజయ్ తన ఛారిటీ ద్వారా చేపడుతున్నారు.

ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ ది ఘనమైన చరిత్ర

తెలంగాణ వీణ , హైదరాబాద్ : ప్రజలను మోసం చేయడంలో ఘనమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ మరోసారి తెలంగాణ యువతను మోసం చేసిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.'ఎన్నికల వాగ్దానంలో భాగంగా. ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ నిరుద్యోగ యువతకోసం కోసం గ్రూప్-1 నోటిఫికేషన్ వేస్తామని, అట్టహాసంగా వార్తాపత్రికల మొదటిపేజీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది కదా,మరి నిన్ననే ఒకటో తేది. ఇది ఫిబ్రవరి నెలే. ఎన్నికల సమయంలో ఇచ్చిన సమయం దాటిపోయింది. మరి ఇంతవరకైతే నోటిఫికేషన్ రాలేదు' అని కేంద్రమంత్రి గుర్తు చేశారు.'హామీలు ఇచ్చి మోసం చేసే ఘనచరిత్ర కలిగిన,కాంగ్రెస్ పార్టీ మరోసారి తన నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. నమ్మి ఓటేసిన తెలంగాణ యువతను నిట్టనిలువునా మోసం చేసింది. యువతను మోసం చేసినట్లే. ఇతర వాగ్దానాలనూ వ్యూహాత్మకంగా దాటవేసే ప్రయత్నం జరుగుతోంది' అని కిషన్ రెడ్డి అన్నారు.

అవుటర్ చుట్టూ టౌన్ షిప్ లు : భట్టివిక్రమార్క

తెలంగాణ వీణ ,హైదరాబాద్ : హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డు చుట్టూ హెచ్ఎండీఏకు ఉన్న ఖాళీ భూముల్లో టౌన్‌షిప్‌లను నిర్మించడం ద్వారా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను సృష్టించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు.ఆర్థిక వ్యవస్థలో హెచ్ఎండీఏ కీలక భూమిక పోషించాలన్నారు. బడ్జెట్ రూపకల్పనలో భాగంగా సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం పురపాలక శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "టౌన్‌షిప్‌ల నిర్మాణం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. మాస్టర్‌ప్లాన్‌లో పేర్కొన్న రహదారుల విస్తరణ ఎంతవరకు ఉంటుందన్నది మార్క్ చేయాలి. దీనిద్వారా ఇళ్లు నిర్మించడం, తర్వాత తొలగించాల్సిన అవసరం ఉండదు. లేఅవుట్లలో మార్ట్‌గేజ్ చేసిన ప్లాట్లను అభివృద్ధి చేయకుండా వదిలేస్తున్నారు. వాటిపై దృష్టి సారించాలి. ఎల్ఆర్ఎస్ కింద వచ్చిన 39 లక్షల దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి.పారిశ్రామికవాడల్లో వేలం ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్లను వినియోగించని పక్షంలో వాటిని వెనక్కు తీసుకోవాలి. అది సాధ్యంకాని పక్షంలో ప్రభుత్వ వాటాను రాబట్టాలి. హెచ్ఎండీఏ పరిధిలో చెరువులకు సంబంధించి ఒక్కో సందర్భంలో ఒక్కో సంఖ్య చెబుతున్నారు. వాటిని శాస్త్రబద్ధంగా నమోదు చేయాలి" అని భట్టివిక్రమార్క అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేశారు: కేటీఆర్

తెలంగాణ వీణ, మేడ్చల్ : ఆరు గ్యారెంటీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులెత్తేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లో నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ హక్కులు సాధించాలంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలిచి తీరాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 అబద్ధపు హామీలు ఇచ్చి గెలిచిందని ఆరోపించారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారని... కానీ ఇప్పటి వరకు ఆ ఊసే లేదన్నారు.100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్... ఇప్పుడు కేంద్రంలో అధికారంలోకి వస్తే వాటిని అమలు చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు... గ్యారెంటీలు అమలు చేసేది లేదని ఎద్దేవా చేశారు. లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీకి గతంలో వచ్చిన సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. I.N.D.I.A. కూటమిలో ముఖ్యమైన పార్టీలు వెళ్లిపోయాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చెక్ పెట్టాలని... కేంద్రంలో బీజేపీని అడ్డుకోగలిగేది ప్రాంతీయ పార్టీలేనని వ్యాఖ్యానించారు.

కృష్ణా జలాల్లో వాటాను తేల్చాలని డిమాండ్

కృష్ణా జలాల్లో కేంద్రం తెలంగాణ వాటాను తేల్చాలని డిమాండ్ చేశారు. మన వాటాను తేల్చకుండానే కేఆర్ఎంబీకి మన కృష్ణా జలాలను రేవంత్ రెడ్డి తాకట్టు పెట్టారని ఆరోపించారు. అందుకే తెలంగాణకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఉండాలన్నారు. తెలంగాణ హక్కుల కోసం కొట్లాడేది బీఆర్ఎస్ ఎంపీలేనని వ్యాఖ్యానించారు. మాయమాటలు చెప్పి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని... 420 హామీలు ఇచ్చిన రేవంత్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పార్లమెంట్ బరిలో బండ్ల

తెలంగాణ వీణ , హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని పలువురు రాజకీయ నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు ఎన్నికలకు రెడీ అవుతున్నాయి. విజయమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. పార్లమెంట్‌లో 12 స్థానాలు గెలవాలని కాంగ్రెస్, అసెంబ్లీ ఎన్నికల్లో ఢీలా పడినా.. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్, బీజేపీ యోచిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు దక్కని పలువురు సీనియర్ నేతలు ఎంపీ టికెట్ల కోసం పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అశావాహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎస్సీ ఎస్సీ అభ్యర్థులు, రూ.25 వేలు, జనరల్ అభ్యర్థులు రూ. 50 వేలు డిపాజిట్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దాంతో పలువురు ఆశావాహులు ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. తాజాగా.. సినీ నిర్మాత బండ్ల గణేష్ ఎంపీ ఎన్నికల బరిలో నిలిచేందుకు రెడీ అయ్యారు. ఈ మేరకు మాల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని గాంధీ భవన్‌లో అప్లికేషన్ పెట్టున్నారు. 'ఈ రోజు ఉదయం మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నాను... మీ అందరి ఆశీస్సులు కావాలి.' అని ట్వీట్ చేశారు.

2018 ఎన్నికల ముందు బండ్ల గణేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల సమయంలో హడావుడి చేసిన బండ్లన్న.. ఆ తర్వాత కాంగ్రెస్ ఓడిపోవటంతో సైలెంట్ అయిపోయారు. కొంత కాలం పార్టీ కార్యకలపాలకు దూరంగా ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు మళ్లీ యాక్టివ్ అయ్యారు. భట్టి చేస్తున్న పాదయాత్రలో కూడా పాల్గొన్నారు. ఆ తర్వాత ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారని.. కూకట్‌పల్లి నుంచి బరిలోకి దిగుతారని ప్రచారం జరిగినా.. అక్కడ మరో అభ్యర్థి ఎమ్మెల్యేగా పోటీ చేసారు.

ఎమ్మెల్యే అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అప్పుడు కూడా ప్రకటించినా.. బండ్ల గణేష్ అప్లయ్ చేసుకోలేదు. కానీ తాజాగా పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు బండ్ల గణేష్ మల్కాజిగిరి స్థానం నుంచి అప్లయ్ చేసుకున్నారు.

తెలంగాణకు కేటాయింపులివే..

తెలంగాణ వీణ , జాతీయం : కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రూ.47,65,768 కోట్లతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఎలాంటి కొత్త పథకాలు.. వరాలు.. వాతలు లేకుండానే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు ఓ సారి పరిశీలిస్తే.. కేంద్ర పన్నుల్లో వాటా కింద రాష్ట్రానికి రూ.25,639 కోట్లు రానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో పన్నుల వాటా కింద తెలంగాణకు రూ.23,400 కోట్లు కేటాయించారు. ఈసారి మరో రూ.2,239 కోట్లను పెంచింది. ఇక కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి రూ.19,760.59 కోట్లు రానున్నాయి. ఇక 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు స్థానిక సంస్థల గ్రాంటు కింద రాష్ట్రానికి మరో రూ.3,200 కోట్లు రానున్నాయి. ఈ మూడు పెద్ద పద్దులు తప్ప రాష్ట్రానికి ఈసారి చెప్పుకోదగ్గ కేటాయింపులు ఏమీలేవు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్లకు నిధులు కేటాయించాలని, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కింద మూడేళ్లకు సంబంధించిన రూ.1800 కోట్లను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు కూడా అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి గతంలో కేంద్రమంత్రులను కలిసి విజ్ఞప్తి కూడా చేశారు. ఈ అనుమతులిస్తే రాష్ట్రానికి రూ.2,300 కోట్లు విడుదలవుతాయని ఆశించారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి, మెట్రో రైలు రెండో దశకు నిధులివ్వాలని, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ.88 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ.90 కోట్ల చొప్పున అదనంగా కేటాయించాలని కోరింది. కానీ, మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం వీటికి ఎలాంటి భరోసా ఇవ్వలేదు. ఇక తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలు, భద్రత ప్రాజెక్టుల కోసం ఈసారి రూ. 5071 కోట్లు కేటాయించారు. 2021- 22 బడ్జెట్‌లో రూ. 2420 కోట్లు కేటాయించగా.. ఇప్పుడు దానిని రెండు రెట్లు పెంచినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2024- 25 ఆర్థిక ఏడాదికి సంబంధించిన బడ్జెట్ 109 శాతం పెరిగి రూ. 5071 కోట్లకు చేరినట్లు తెలిపారు. తెలంగాణలో 100 శాతం విద్యుదీకరణ పూర్తయినట్లు చెప్పిన ఆయన.. రాష్ట్రంలో రైల్వేపై పెట్టుబడులు గణనీయంగా పెరిగాయన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి పీఎం శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి షాక్..

తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో : గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి విజయవాడ ప్రతినిధుల కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. గతంలో ప్రసాదంపాడులో జరిగిన ఓ ఘటనపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణ సమయంలో ఆయన కోర్టుకు హాజరుకాకపోవడంతోనే వారెంట్ జారీ చేసింది న్యాయస్థానం. వంశీపై నాలుగు కేసుల్లో ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయనకు అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది.రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలై అభ్యర్థుల ఎంపిక హడావుడి... బాగా పెరిగిపోయింది. కానీ, వంశీ మాత్రం పోటీపై నోరు విప్పడం లేదు. మరోవైపు, గత కొద్ది రోజులుగా ఎమ్మెల్యే వంశీ సైలెంట్‌గా ఉన్నారు. నెలన్నరగా నియోజకవర్గ ప్రజలకు ఆయన కనిపించడంలేదని, హైదరాబాద్‌లోనే ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. వల్లభనేని వంశీ గన్నవరం నియోజకవర్గం నుంచి రెండుసార్లు టీడీపీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు.ఎన్నికల అనంతరం ఆయన వైఎస్ఆర్సీపీకి మద్దతు తెలపడంతో అక్కడ గత ఎన్నికలలో పోటీ చేసిన యార్లగడ్డ వెంకట్రావు టీడీపీలోకి వెళ్లి అక్కడ ఇన్‌ఛార్జి పదవిని చేపట్టారు. ఒకవేళ, వంశీ వైఎస్ఆర్సీపీ నుంచి పోటీచేస్తే యార్లగడ్డను ఎదుర్కొనాల్సి ఉంటుంది. కానీ ఆ పార్టీలోని దుట్టా రామచంద్రరావు కూడా వల్లభనేని వంశీ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో వల్లభనేని వంశీని తప్పిస్తారా? లేక ఆయనకు మరొక సీటును కేటాయిస్తారా? అన్న దానిపై కూడా చర్చ జరుగుతుంది.

మోడల్ పూనమ్ పాండే కన్నుమూత

తెలంగాణ వీణ , సినిమా : ప్రముఖ మోడల్, సినీ నటి పూనమ్ పాండే మృతి చెందారు. ఈ ఉదయం పూనమ్ చనిపోయినట్టు ఆమె సోషల్ మీడియా అకౌంట్ ద్వారా ఆమె టీమ్ ప్రకటించింది. ఆమె వయసు 32 ఏళ్లు. 'ఈరోజు మాకు ఎంతో కఠినమైన రోజు. గర్భాశయ క్యాన్సర్ కారణంగా మేము ఎంతో అభిమానించే పూనమ్ పాండే చనిపోయారని చెప్పడానికి ఎంతో బాధపడుతున్నాం. ఆమెతో పరిచయం ఉన్న ప్రతి వ్యక్తి స్వచ్ఛమైన ప్రేమ, దయను పొందారు. ఈ బాధాకరమైన సమయంలో మేము గోప్యతను కోరుకుంటున్నాం' అని పూనమ్ టీమ్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు.పూనమ్ పాండే బాలీవుడ్, కన్నడతో పాటు తెలుగు సినిమాల్లో కూడా నటించారు. టీవీ షోలు కూడా చేశారు. శృంగార తారగా ఆమె ఇంటర్నెట్ ను షేక్ చేశారు. మరోవైపు, పూనమ్ పాండే చనిపోయారనే వార్తతో ఆమె అభిమానులు షాక్ కు గురవుతున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు.